ఆంధ్రజ్యోతి


andhrajyothy.com

శుక్రవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 40.4 కనిష్ఠం 27.2

నిజామాబాద్ జిల్లా వార్తలు

5

శనివారం 30 మార్చి 2024



సాఫ్ట్‌బాల్ పోటీలకు క్రీడాకారుల ఎంపిక

డిచ్‌పల్లి, మార్చి 29: మండలంలోని సుద్దపల్లి సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల విద్యార్థినీలు జాతీయస్థాయి సాఫ్టబాల్ పోటీలకు ఎంపికయ్యారు. ఈనెల 29 నుంచి ఏప్రిల్ 1 వరకు మహారాష్ట్రలో జరిగే జాతీయ స్థాయి సాఫ్టబాల్ పోటీలకు క్రీడాకారులు లిఖిత, గంగోత్రి, నిశితలు ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ గోదావరి తెలిపారు. క్రీడాకారులు ఇటీవల ఆదిలాబాద్‌లో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ కనబర్చినట్లు చెప్పారు. ఎంపికైన క్రీడాకారులను ప్రిన్సిపాల్‌తోపాటు కళాశాల సిబ్బంది అభినందించారు.



- బ్లాక్ లిస్టులో ధాన్యం పక్కదారి పట్టించిన మిల్లులు
- నిర్ణీత సమయంలో సీఎంఆర్ అందించిన మిల్లులకే కేటాయింపులు
- మిల్లుతో పాటు మరో రెండు మిల్లుల గ్యారంటీ తీసుకుంటున్న వైనం
- ధాన్యం తరలించేందుకు పది క్లస్టర్‌ల ఏర్పాటు

ధాన్యం కొనుగోళ్లపై నజర్!

నిజామాబాద్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లాలో ధాన్యం కొనుగోళ్లను ప్రారంభించిన అధికారులు రైస్‌మిల్లర్లపై నజర్ పెట్టారు. గత కొన్నేళ్లుగా ధాన్యం పక్కదారి పట్టిస్తున్న మిల్లులను పక్కనపెట్టడంతోపాటు సక్రమంగా సీఎంఆర్‌ను అందించిన మిల్లులకే ప్రాధాన్యత ఇవ్వనున్నారు. గతంలో కేటాయింపులు చేసిన విధంగా కాకుండా ఈ దఫా మిల్లర్ గ్యారంటీతో పాటు మరోరెండు మిల్లుల యజమానుల నుంచి, అసోసియేషన్ నుంచి గ్యారంటీ ఇస్తేనే ధాన్యాన్ని కేటాయించేందుకు సిద్ధమవుతున్నారు. ఈ యాసంగిలో 6లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు ప్రణాళికను రూపొందించారు. ఇప్పటికే కొనుగోలు ప్రారంభించిన యంత్రాంగం పూర్తిస్థాయిలో ధాన్యాన్ని సేకరించేందుకు ఏర్పాట్లను చేస్తున్నారు. అన్నికొనుగోలు కేంద్రాల్లో తూకాలతోపాటు అన్ని రకాలుగా సక్రమంగా జరిగేందుకు ఏర్పాట్లను చేస్తున్నారు. వర్షాలు వచ్చే అవకాశం ఉండటంతో టార్పాలిన్‌లతో పాటు ఇతర వస్తువులను కొనుగోలు కేంద్రాలకు సమకూరుస్తున్నారు.

దిగుబడి అంచనా 11.7 లక్షల మెట్రిక్ టన్నులు


జిల్లాలో ధాన్యం కొనుగోళ్లను అధికారులు ప్రారంభించారు. ఎడపల్లిలో మొదలు పెట్టిన అధికారులు భారీ ఎత్తున కొనేందుకు సిద్ధమవుతున్నారు. జిల్లాలో 4లక్షల ఎకరాలకు పైగా యాసంగిలో వరిసాగు కావడంతో ఈ దఫా దిగుబడి 11లక్షల 72వేల మెట్రిక్ టన్నులకు పైగా వస్తుందని అంచనా వేశారు. వ్యాపారులు, మిల్లర్లు కొనుగోలు చేసే ధాన్యం ఉండటంతో సుమారు 6లక్షల మెట్రిక్ టన్నుల వరకు కొనుగోలు చేయాలని నిర్ణయించారు. జిల్లాలో ఈ ధాన్యం కొనుగోలు కోసం 466 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటుచేశారు. ప్రాథమిక వ్యవసాయ, సహకార సంఘాల ద్వారా 379కేంద్రాలు, ఐకేపీ ద్వారా 45, ఐడీసీఎంఎస్ ద్వారా 29, మార్క్స్ ద్వారా 2, మెప్మా ద్వారా 2, కేపీపీఎస్ఎఫ్ఎస్ ద్వారా 5 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఎడపల్లిలో ప్రాథమికంగా ఒక కేంద్రాన్ని ప్రారంభించిన అధికారులు అన్ని గ్రామాల పరిధిలో ఒక వారం లోపు కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు సిద్ధమయ్యారు. ఈ కేంద్రాలకు అవసరమైన ఏర్పాట్లను చేస్తున్నారు. ధాన్యం కొనుగోలును ఏప్రిల్ నెలలో 2లక్షల 50వేల మెట్రిక్ టన్నులు, మే నెలలో 3 లక్షల మెట్రిక్ టన్నులు, జూన్ నెలలో 50వేల మెట్రిక్ టన్నులను కొనుగోలు చేసేందుకు నిర్ణయం తీసుకున్నారు. ఈ కొనుగోలుకు 3 కోట్ల గన్నీబ్యాగులు అవసరం అవుతాయని అంచనా వేశారు. ఇప్పటికే కోటిన్నర గన్నీ బ్యాగులు అందుబాటులో ఉండటంతో మిగతావి తెప్పించేందుకు సిద్ధమవుతున్నారు. కొనుగోలు చేయడంతోపాటు ధాన్యాన్ని నిలువ చేసేందుకు అవసరమైన గోదాముల ఏర్పాట్లను కూడా చేస్తున్నారు. జిల్లాలో అన్ని కొనుగోలు కేంద్రాల నుంచి తరలించేందుకు వాహనాలను కూడా సమకూరుస్తున్నారు. ప్రతీ కొనుగోలు కేంద్రాల్లో హమాలీలను ఉంచడంతో పాటు రైతులకు కావాల్సిన ఏర్పాట్లను చేస్తున్నారు. మొత్తం కొనుగోలు కేంద్రాల కోసం 18,640 టార్పాలిన్‌లు, ప్యాడీక్లీనర్లు 466, మాయిశ్చర్ మీటర్లు 1053, వేయింగ్ మిషన్‌లు 466, అస్కురిమూవర్‌లు 466తో పాటు ఇతర యంత్రాలను అందుబాటులో ఉంచేందుకు నిర్ణయాన్ని తీసుకున్నారు. అన్ని కొనుగోలు కేంద్రాల వద్ద తాగునీటితో పాటు ఇతర సౌకర్యాలను కల్పించేందుకు సిద్ధమవుతున్నారు.

బ్లాక్ లిస్టులో 40 మిల్లులు

జిల్లాలో ఈ యాసంగిలో కొనుగోలు చేసిన ధాన్యాన్ని మిల్లులకు కేటాయించేందుకు నిర్ణయం తీసుకున్నారు. గత నాలుగైదు ఏళ్లుగా ధాన్యం తీసుకొని కస్టం మిల్లింగ్ కింద బియ్యాన్ని ఎఫ్‌సీఐకి అందించని మిల్లులను బ్లాక్ లిస్టులో పెట్టారు. కొన్ని మిల్లుల యజమానులు ధాన్యం తీసుకోవడంతో పాటు 250 కోట్ల వరకు పక్కదారి పట్టించారు. ధాన్యం నిల్వలు లేకపోవడంతోపాటు బియ్యాన్ని కూడా సకాలంలో అందించలేదు. చివరకు అధికారులు తనిఖీలు చేసి ఆ మిల్లులపై కేసులను నమోదు చేశారు. రికవరీ కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. గత కొన్నేళ్లుగా కస్టం మిల్లింగ్ కింద ధాన్యాన్ని తీసుకొని కొన్ని బియ్యాన్ని అందించని 40 మిల్లులను బ్లాక్ లిస్టులో పెట్టారు. ఆ మిల్లులకు ధాన్యాన్ని ఈసీజన్‌లో కేటాయించవద్దని నిర్ణయం తీసుకున్నారు. జిల్లాలో మొత్తం 363 రైస్‌మిల్లులు ఉన్నాయి. వీటిలో రా రైస్‌మిల్లులు 290 ఉండగా, బాయిల్డ్ మిల్లులు 73 ఉన్నాయి. ఈ దఫా ధాన్యం కేటాయింపులను క్రమబద్ధీకరిస్తున్నారు. గతంలాగా కాకుండా గ్యారంటీలు ఇస్తేనే కేటాయింపులను చేయనున్నారు. మిల్లర్ గ్యారంటీతో పాటు మరో రెండు మిల్లుల యజమానుల నుంచి గ్యారంటీ ఇస్తేనే ఈ దఫా ధాన్యాన్ని కేటాయించనున్నారు. వీరేకాకుండా రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుని నుంచి అనుమతి తీసుకుంటేనే ఆ మిల్లులకు కెపాసిటీకి అనుగుణంగా ధాన్యాన్ని కేటాయిస్తారు. జిల్లాలో ధాన్యం తీసుకొని కొన్ని పెద్ద మిల్లులు పక్కదారి పట్టించడం, కొత్త ప్రభుత్వం సీరియస్ కావడంతో అధికారులు కూడా అన్ని రకాల నిబంధనలు పాటించేందుకు నిర్ణయించారు. అవసరమైతే కొంతకాలం ధాన్యాన్ని నిలువ చేసి రెగ్యూలర్‌గా అందించే మిల్లులకే కేటాయించేందుకు సిద్ధమవుతున్నారు. గతంలాగా తరుగు తీయడంపైన ఆరోపణలు ఎక్కువగా రావడంతో ప్రతీ కొనుగోలు కేంద్రం ఆధారంగా తనిఖీలు చేయడంతోపాటు ఆయా ప్రాథమిక వ్యవసాయ, సహకార సంఘాలకు సంబంధించి పూర్తిస్థాయిలో చర్యలు చేపట్టేందుకు నిర్ణయం తీసుకున్నారు. చాలా సొసైటీల నుంచి ఆరోపణలు రావడం, రైతులకు సంబంధించిన ధాన్యానికి తూకంలో తేడారావడంతో రాష్ట్రసహకార శాఖ అధికారులతో పాటు వ్యవసాయ శాఖ మంత్రికి ఫిర్యాదులు చేశారు. ఆ ఫిర్యాదుల ఆధారంగా ఇప్పటికే రెండు దఫాలు దర్యాప్తు చేసిన రాష్ట్ర అధికారులు ప్రభుత్వానికి నివేదికను కూడా ఇచ్చారు. కొనుగోలును క్రమబద్ధీకరించడంతో పాటు ధాన్యం కేటాయింపులను సరైన మిల్లులకే ఈ దఫా కేటాయించేందుకు నిర్ణయం తీసుకున్నారు. గత కొన్నేళ్లుగా సాగుతున్న ధాన్యం దందాకు చెక్ పెట్టేందుకు అధికార యంత్రాంగం సిద్ధమవుతోంది. జిల్లాలో ధాన్యం కొనుగోలుకు అన్నిరకాల ఏర్పాట్లను చేశామని జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి చంద్రప్రకాశ్, సంస్థ జిల్లా మేనేజర్ జగదీశ్వర్‌గౌడ్ తెలిపారు. కొద్దిరోజుల్లోనే అన్ని గ్రామాల పరిధిలో ఈ కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తామని తెలిపారు.



కాంగ్రెస్ జిల్లా నేతలతో.. సీఎం సమీక్ష



సీఎం, రాష్ట్ర ఇన్‌చార్జిని కలిసిన నిజామాబాద్ పార్లమెంట్ అభ్యర్థి జీవన్‌రెడ్డి

- హాజరైన ఎంపీ అభ్యర్థితోపాటు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జీలు
- నేతలకు దిశానిర్దేశం చేసిన సీఎం రేవంత్‌రెడ్డి
- పార్లమెంట్ ఎన్నికలపై నిజామాబాద్‌లో నేడు కాంగ్రెస్ పార్టీ సన్నాహక సమావేశం
- హాజరవుతున్న పార్టీకి చెందిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, సీనియర్ నేతలు

నిజామాబాద్, మార్చి29 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): నిజామాబాద్ పార్లమెంట్ ఎన్నికలపై జిల్లా నేతలతో సీఎం రేవంత్‌రెడ్డి సమీక్షించారు. కాంగ్రెస్ అభ్యర్థి ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డితోపాటు పార్లమెంట్ పరిధిలోని ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌చార్జీలు, రాష్ట్ర కార్పొరేషన్ ఛైర్మన్లు, పార్టీ సీనియర్ నేతల ఆధ్వర్యంలో నియోజకవర్గాల వారిగా పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ ఎన్నికల్లో ఎలాగైనా సీటును గెలవడంతో పాటు భారీ మెజార్టీ వచ్చేలా చూడాలని కాంగ్రెస్ నేతలకు సీఎం దిశానిర్దేశం చేశారు. ప్రతీ కార్యకర్త పూర్తిస్థాయిలో ఈ ఎన్నికల కోసం పనిచేయాలని ఆదేశాలు ఇచ్చారు. నియోజకవర్గాల వారిగా సమీక్షిస్తూనే అందరూ కలిసికట్టుగా పనిచేయాలన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పరిస్థితి అనుకూలంగా ఉందని నేతలందరూ కలిసికట్టుగా పనిచేస్తే మెజార్టీ సీట్లు వస్తాయని సీఎం వారికి వివరించారు.



సమీక్షలో జిల్లా నేతలతో మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి

పలు అంశాలపై చర్చ

నిజామాబాద్ పార్లమెంట్ స్థానానికి జరిగే ఎన్నికలపై సీఎం క్యాంప్ కార్యాలయంలో శుక్రవారం జరిగిన సమీక్షలో పలు అంశాలపై సీఎం చర్చించారు. ఈ సమీక్షలో కాంగ్రెస్ అభ్యర్థి ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, జిల్లా ఎమ్మెల్యేలు పి.సుదర్శన్‌రెడ్డి, డాక్టర్ భూపతిరెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జీలు రాష్ట్ర సలహాదారులు మాజీ మంత్రి షబ్బీర్ అలీ, పీసీసీ వర్కింగ్ ప్రసిడెంట్, ఎమ్మెల్సీ మహేష్‌కుమార్‌గౌడ్, రాష్ట్ర ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్, వినయ్‌రెడ్డి, సునీల్‌రెడ్డి, జువ్వాడి నర్సింగరావు, రాష్ట్ర కార్పొరేషన్ ఛైర్మన్లు తాహెర్‌బిన్ హందాన్, మాజీవిప్ ఈరవత్రి అనిల్, అన్వేష్ రెడ్డి, జిల్లా అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి, జగిత్యాల జిల్లా అధ్యక్షుడు లక్ష్మణ్, మాజీ ఎమ్మెల్సీలు ఆకులలలిత, అరికెల నర్సారెడ్డి, పీసీసీ ప్రధాన కార్యదర్శులు గడుగుగంగాధర్, నగేష్‌రెడ్డి, నగర అధ్యక్షులు కేశవేణు, రత్నాకర్‌తో పాటు ఇతర నేతలు హాజరయ్యారు. పార్లమెంట్ పరిధిలోని ఏడు నియోజకవర్గాల పరిధిలో ఉన్న పలు అంశాలపైన చర్చించారు. తాజా పరిస్థితిని అంచనా వేశారు. ఏఏ నియోజకవర్గాల్లో ఎలాంటి పరిస్థితి ఉందో నియోజకవర్గ ఇన్‌చార్జీలు సీఎంకు వివరించారు. పార్లమెంట్ పరిధిలోని ఏడు నియోజకవర్గాల్లో అందరూ కలిసికట్టుగా పనిచేయడంతో పాటు భారీ మెజార్టీతో గెలిచే విధంగా చూడాలని సీఎం రేవంత్‌రెడ్డి కోరారు. పార్టీ క్యాడర్‌ను అందరిని కలుపుకొని ముందుకు పోవాలని ఆదేశాలు ఇచ్చారు. నియోజకవర్గాల వారిగా సమావేశాలను నిర్వహించడంతో పాటు పూర్తిస్థాయిలో పనిచేయాలని అన్నారు. ప్రతీరోజు అన్ని గ్రామాలను పర్యటించడంతో పాటు ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరు గ్యారంటీలను వివరించాలని కోరారు. రైతులు, మహిళల కోసం అమలు చేస్తున్న పథకాలను వివరిస్తూనే పూర్తిస్థాయిలో చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశాలు ఇచ్చారు. నియోజకవర్గాల పరిధిలో ప్రత్యేక సమావేశాలను నిర్వహించి నేతలందరూ పాల్గొనేవిధంగా చూడాలన్నారు. పార్టీలో చేరుతున్న ఇతర పార్టీల నేతలను కలుపుకొని భారీ మెజార్టీ వచ్చేలా పనిచేయాలని సీఎం ఆదేశాలను ఇచ్చారు. దీంతో పార్లమెంట్ పరిధిలో ప్రచారం, సన్నాహక సమావేశాన్ని నేడు నిజామాబాద్‌లో నిర్వహిస్తున్నారు. నిజామాబాద్ పా ర్లమెంట్ పరిధిలోని అందరూ నియోజకవర్గ ఇన్‌చార్జీలతో పాటు సీనియర్ నేతలు హాజరయ్యే సమావేశంలో నియోజకవర్గాల వారిగా సమీక్షించడంతోపాటు ప్రచారానికి కార్యచరణను రూపొందించనున్నారు. ఈ సమావేశానికి పార్టీ నేతలందరూ హాజరు కానున్నారు. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో పాటు రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు, కార్పొరేషన్ ఛైర్మన్లు, నియోజకవర్గ ఇన్‌చార్జీలతో పాటు సీనియర్ నేతలు హాజరుకావడంతోపాటు నియోజకవర్గాల వారిగా కమిటీలను ఏర్పాటు చేయనున్నారు.

సీఎంను, రాష్ట్ర ఇన్‌చార్జిని కలిసిన జీవన్‌రెడ్డి

తనను కాంగ్రెస్ అభ్యర్థిగా ప్రకటించడంతో సీఎం రేవంత్‌రెడ్డిని, రాష్ట ఇన్‌చార్జి దీపాదాస్ మున్షిని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి శుక్రవారం క్యాంప్ కార్యాలయంలో కలిశారు. ఆయన వెంట జిల్లాకు చెం దిన మాజీ మంత్రి, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి, కాంగ్రెస్ వర్కింగ్ ప్రసిడెంట్ ఎమ్మెల్సీ మహేష్‌కుమార్‌గౌడ్, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు వేము నరేందర్ రెడ్డి, షబ్బీర్‌అలీ, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్, జువ్వాడి నర్సింగరావుతో పాటు ఇతర నేతలు ఉన్నారు.



మార గంగారెడ్డికి కాంగ్రెస్ కండువా కప్పుతున్న సీఎం రేవంత్‌రెడ్డి, మహేష్

కాంగ్రెస్ గూటికి మార్క్‌ఫెడ్ ఛైర్మన్

నిజామాబాద్, మార్చి29 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): రాష్ట్ర మార్క్‌ఫెడ్ ఛైర్మన్ మార గంగారెడ్డి సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో శుక్రవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఆయనకు సీఎం కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో పార్టీ వర్కింగ్ ప్రసిడెంట్ ఎమ్మెల్సీ మహేష్‌కుమార్‌గౌడ్, మాజీ మంత్రి, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి, ఆర్మూర్, బాల్కొండ కాంగ్రెస్ ఇన్‌చార్జీలు వినయ్‌రెడ్డి, సునీల్‌రెడ్డి, బాన్సువాడ ఇన్‌చార్జి రవీందర్‌రెడ్డితో పాటు కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి పాల్గొన్నారు. కాంగ్రెస్ చేపట్టిన ప్రజాసంక్షేమ పథకాలను చూసి తాను పార్టీలోచేరినట్లు మారగంగారెడ్డి తెలిపారు.

కాంగ్రెస్‌లోకి నగర మాజీ మేయర్, మాజీ కౌన్సిలర్లు



కాంగ్రెస్ కండువా కప్పుకున్న మాజీ మేయర్, మాజీ కార్పొరేటర్లు

నిజామాబాద్ అర్బన్: నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ తొలి మహిళా మేయర్‌గా పనిచేసిన ఆకుల సుజాతతో పాటు 20మంది మాజీ కార్పొరేటర్లు శుక్రవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. అర్బన్ ఇన్‌చార్జి షబ్బీర్ అలీ సమక్షంలో వారు కాంగ్రెస్‌లో చేరారు. అనంతరం గాంధీభవన్‌లో రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీప్‌దాస్ మున్షి, వర్కింగ్ ప్రెసిడెంట్ మహేష్‌కుమార్‌గౌడ్, ప్రచార కమిటీ ఛైర్మన్ మధుయాష్కి, తదితరులను కలిశారు. నగర మాజీ మేయర్ తోపాటు మాజీ కార్పొరేటర్లు తేజస్విని శ్రీనివాస్‌రెడ్డి, పుప్పాల విజయ భాజన్న, అంతిరెడ్డి లత దేవేందర్‌రెడ్డి, నరేందర్‌గౌడ్ గంగామణి, గోపరి సుగుణ లక్ష్మణ్, చంద్రకళ, శ్రీహరినాయక్, ముత్యాల ప్రకాశ్, గంగారెడ్డి, మధుసూదన్‌రెడ్డి, బాబురావు, అపర్ణ, కృష్ణ, రమేష్, వీర్‌కుమార్, తదితరులు కాంగ్రెస్‌లో చేరిన వారిలో ఉన్నారు. కార్యక్రమంలో ఉర్దూ అకాడమి ఛైర్మన్ తాహెర్‌బిన్ హందాన్, మాజీ ఎమ్మెల్సీ ఆకుల లలిత, తదితరులున్నారు.



కామారెడ్డి మున్సిపల్ కార్యాలయం

అవిశ్వాసంపై ఉత్కంఠ!

- నేడు కామారెడ్డి మున్సిపల్ చైర్‌పర్సన్‌పై అవిశ్వాసం
- అవిశ్వాసం నెగ్గాలంటే మ్యాజిక్ ఫిగర్ 34 మంది మద్దతు ఉండాలి
- కాంగ్రెస్ వద్ద 27, బీఆర్ఎస్ వద్ద 16, బీజేపీ వద్ద ఆరుగురు కౌన్సిలర్లు
- సొంత పార్టీ చైర్‌పర్సన్‌పై అవిశ్వాసానికి బీఆర్ఎస్ కౌన్సిలర్‌లు సహకరించేనా?

కామారెడ్డిటౌన్, మార్చి29: గత కొన్నిరోజులుగా కామారెడ్డి మున్సిపల్ చైర్‌పర్సన్ నిట్టుజాహ్నావిపై కొనసాగుతున్న అవిశ్వాస చర్చకు నేడు తెరపడనుంది. 15రోజుల క్రితం మున్సిపల్ చైర్‌పర్సన్‌పై అవిశ్వాసం ప్రకటిస్తూ కాంగ్రెస్ కౌన్సిలర్లు కలెక్టర్ జితేష్ వి.పాటిల్‌ను కలిసి సమావేశం ఏర్పాటుచేయాలని కోరినవిషయం తెలిసిందే. దీంతో కలెక్టర్ మున్సిపల్ చైర్‌పర్సన్‌తోపాటు మున్సిపల్ పాలకవర్గంలోని అన్నిపార్టీల కౌన్సిలర్‌లకు అవిశ్వాసంపై నిర్వహించే సమావేశానికి సంబంధించి నోటీసులు సైతం ఇచ్చాయి. అయితే అవిశ్వాసానికి సంబంధించి కలెక్టర్‌కు వినతిపత్రం అందించిన రోజే కాంగ్రెస్ కౌన్సిలర్లు 27మంది క్యాంపుకు తరలారు. అయితే అవిశ్వాసానికి 34 మంది సంఖ్య బలం కావాల్సి ఉండడంతో కాంగ్రెస్ నాయకులు పలువురు బీఆర్ఎస్ కౌన్సిలర్‌లు, నాయకులతో సంప్రదింపులు జరుపగా అందులో 10మంది కౌన్సిలర్‌లు చైర్‌పర్సన్‌కు వ్యతిరేకంగా అవిశ్వాసానికి మద్దతు ప్రకటించేందుకు సిద్ధపడి వారు సైతం క్యాంపునకు తరలారు. దీంతో చైర్‌పర్సన్‌కు మద్దతుగా కేవలం ఐదుగురు కౌన్సిలర్లు మాత్రమే ఉండడంతో రాజీనామా చేస్తారనే పుకార్లు పీకార్లు కొట్టాయి. కానీ శుక్రవారం వరకు ఎలాంటి రాజీనామా చేయకపోవడంతో అవిశ్వాసాన్ని ఎదుర్కొనేందుకు చైర్‌పర్సన్ సిద్ధమైనట్లు తెలుస్తోంది. అయితే గోవా నుంచి హైదరాబాద్‌కు చేరుకున్న కాంగ్రెస్ కౌన్సిలర్లు శుక్రవారం ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్‌అలీ సమక్షంలో సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి అవిశ్వాసంపై చర్చించారు.

అవిశ్వాసం నెగ్గేందుకు మ్యాజిక్ ఫిగర్ 34 ఉండాల్సిందే..

మున్సిపల్ చైర్‌పర్సన్‌ను పదవి నుంచి దించేయాలంటే మ్యాజిక్ ఫిగర్ 34 మంది కౌన్సిలర్లు ఉండాలి. అయితే కామారెడ్డి మున్సిపల్‌లో మొత్తం 49మంది కౌన్సిలర్లు ఉండగా ప్రస్తుతం కాంగ్రెస్‌కు 27మంది, బీఆర్ఎస్‌కు 16, బీజేపీకి ఆరుగురు కౌన్సిలర్లు ఉన్నారు. కానీ అవిశ్వాసం నెగ్గాలంటే మొత్తం 34 మంది కౌన్సిలర్‌లు కావాల్సి ఉండగా మరో ఏడుగురు కౌన్సిలర్‌లు కావాల్సి ఉంది. అవిశ్వాసానికి బీజేపీలో ఉన్న ఆరుగురు కౌన్సిలర్‌లు దూరంగా ఉండడంతో బీఆర్ఎస్‌కు చెందిన కౌన్సిలర్లు చైర్‌పర్సన్‌పై అవిశ్వాసానికి మద్దతు ఇచ్చేందుకు ముందుకు వచ్చారు. దీంతో బీఆర్ఎస్‌లో ఉన్న చైర్‌పర్సన్‌తోపాటు ఉన్న 15మంది కౌన్సిలర్‌లలో ఐదుగురు మాత్రమే చైర్‌పర్సన్‌వైపు ఉండగా మిగిలిన 10మంది కౌన్సిలర్‌లు మాత్రం చైర్‌పర్సన్‌ను పదవి నుంచి దించేందుకు సహకరించేందుకు సిద్ధమయ్యారు. దీంతో కాంగ్రెస్ కౌన్సిలర్లు పెట్టిన అవిశ్వాసానికి సంఖ్యాబలం 37గా ఉండనుంది. ప్రస్తుతం ఆ పదిమంది బీఆర్ఎస్ కౌన్సిలర్‌లపైనే చైర్‌పర్సన్ నిట్టుజాహ్నావి పదవిలో ఉంటారా లేదా అనేది ఆధారపడి ఉందనే వాదనలు వినిపిస్తున్నాయి. ఒకవేళ బీఆర్ఎస్ రాష్ట్రనాయకత్వం నుంచి ఏమైనా ఆదేశాలు వచ్చి విప్ జారీచేస్తే మాత్రం కౌన్సిలర్‌లలో ఎంతమంది అవిశ్వాసానికి మద్దతు ప్రకటిస్తారనేది నేడు తెలనుంది.

నేడు నేరుగా మున్సిపల్ కార్యాలయానికి చేరుకోనున్న కౌన్సిలర్లు

అవిశ్వాసంపై కలెక్టర్‌కు వినతిపత్రం అందించిన వెంటనే క్యాంపుతరలిన కాంగ్రెస్ కౌన్సిలర్లు కొన్నిరోజులుగా గోవాలోనే ఉన్నారు. ఆ తర్వాత బీఆర్ఎస్ కౌన్సిలర్లు సైతం గోవాకు వెళ్లిన వేరే ప్రాంతంలో క్యాంపులో ఉన్నారు. క్యాంపులో కాంగ్రెస్ కౌన్సిలర్‌లలో పలువురు ఎక్కువరోజులు ఇలా ఉండాలంటే తమ వల్ల కావడం లేదంటూ అసంతృప్తి వ్యక్తంచేయడంతో వారిని బుజ్జగించేందుకు కాంగ్రెస్ జిల్లాఅధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్‌రావు అక్కడికి వెళ్లి సమన్వయం కుదిర్చారు. ఆ తర్వాత గత మూడురోజుల కిందట కాంగ్రెస్ కౌన్సిలర్‌లు హైదరాబాద్‌కు చేరుకోన్నారు.

రంజాన్ వేళలు

శనివారం	ఆదివారం
ఇఫ్తార్ సా.6.35	సహర్ ఉ.4.49



ఎవరైతే అల్లాహ్‌పై సంపూర్ణ విశ్వాసంతో పుణ్యాన్ని ఆశిస్తూ రంజాన్ మాసంలో ఉపవాసదీక్షలు పాటిస్తారో వారి వెనుకటి పాపాలన్నీ మన్నించబడతాయి.

ప్రశ్నిస్తే కేసులు పెట్టే నైజం వారిది

● ఏనుగు రవీందర్ రెడ్డి సమక్షంలో పార్టీలో చేరికలు

మోస్రా, మార్చి 29: మోస్రా మండల కేంద్రంలోని రెడ్డి సంఘంలో మండల కాంగ్రెస్ పార్టీ ఏర్పాటు చేసిన సమావేశంలో వంద రోజులుగా కాంగ్రెస్ పార్టీ చేస్తున్న అభివృద్ధి పనులకు ఆకర్షితులై 60మంది వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీ బాన్సువాడ నియోజకవర్గ ఇన్‌చార్జి ఏనుగు రవీందర్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఏనుగు రవీందర్ రెడ్డి మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీ నాయకులు చేస్తున్న అక్రమాలకు 10ఏళ్ల అధికారంలో ఉన్న పార్టీ నాయకులు, కార్యకర్తలు చెట్టుకు ఒకరు పుట్టకు ఒకరు అయ్యారన్నారు. పోచారం శ్రీనివాస్ రెడ్డి శాసనసభ్యుడిగా గెలిచినా ఆయన కొడుకు మొన్ననే డీసీసీబీ డైరెక్టర్లు అవిశ్వాసం తీర్మానం చేయగా డీసీసీబీ ఉమ్మడి జిల్లా అధ్యక్ష పదవి పోయిందన్నారు. ప్రశ్నిస్తే పోలీసు కేసులు పెట్టించడం పోచారం కొడుకులకు పారిపాటిగా మారిందని ఎద్దేవా చేశారు. ఇందులో యలమంచిలి శ్రీనివాస్, మోస్రా మండల కోకన్వీనర్ కొత్తకొండ భాస్కర్, మేక వీర్రాజు, నందు పటేల్, మాజీ సర్పంచ్ అరిగే సాయిలు, మండల అధ్యక్షుడు కొత్తిమీర్‌కర్ లక్ష్మణ్, బిల్లా రాజేశ్వర్ రెడ్డి, నర్సారెడ్డి, తదితరులున్నారు.



కాంగ్రెస్‌లో చేరిన వారితో ఏనుగు రవీందర్ రెడ్డి



నందిపేటలోని వివేకానంద చౌరస్తాలో ఆందోళన చేస్తున్న బాధిత కుటుంబ సభ్యులు, బంధువులు

చికిత్స పొందుతూ యువకుడి మృతి

● లక్కంపల్లి సెజ్ సిబ్బంది ఒత్తిడే కారణం అంటూ మృతదేహంతో బాధితుల రాస్తారోకో



మృతి చెందిన మహేష్

నందిపేట, మార్చి 29: మండల కేంద్రానికి చెందిన బొడ్డు మహేష్(36) అనే యువకుడు శుక్రవారం ఆసుపత్రి చికిత్స పొందుతూ మరణించారు. మండలంలోని లక్కంపల్లి సెజ్ సిబ్బంది ఒత్తిడి కారణంగా మహేష్ మృతి చెందినట్టు ఆరోపిస్తూ కుటుంబసభ్యులు, బంధువులు, స్నేహితులు శుక్రవారం మండల కేంద్రంలోని వివేకానందచౌరస్తాలో మృతదేహంతో ఆందోళన చేపట్టారు. సంఘటనకు సంబంధించి పూర్తి వివరాలిలా ఉన్నాయి.. మండల కేంద్రంలోని హన్మాన్ గల్లీకి చెందిన బొడ్డు మహేష్ అనే యువకుడు గత కొన్ని సంవత్సరాలుగా మండలంలోని లక్కంపల్లి శివారులో ఉన్న ఫుడ్ పార్క్‌లో వాచ్‌మన్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ఈనెల 10న మహేష్‌పై కుక్క దాడి చేయడంతో తీవ్ర రక్తస్రవం ఆసుపత్రిలో చిక్క పొందుతున్నాడు. సెజ్‌లోని సిబ్బంది ఒత్తిడి కారణంగా కుక్క కాటువేసిన్పటికీ పనిలో చేరాడు. శుక్రవారం ఉదయం తీవ్ర జ్వరం రావడంతో జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో చేరాడు. చికిత్స పొందుతూ బొడ్డు మహేష్ మృతి చెందాడు. మహేష్ మృతికి సెజ్ యాజమాన్యం, సిబ్బంది కారణమంటూ బాధిత కుటుంబసభ్యులు, బంధువులు, స్నేహితులు మహేష్ మృతదేహంతో మండల కేంద్రంలోని వివేకానంద చౌరస్తాలో ఆందోళనకు దిగారు. బాధిత కుటుంబానికి న్యాయం చేస్తూ కారకులైన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.


వర్నిలో కేక్ కట్ చేస్తున్న టీడీపీ నాయకులు

ఘనంగా టీడీపీ ఆవిర్భావ దినోత్సవం

వర్ని,మార్చి29: వర్ని మండల కేంద్రంలో శుక్రవారం తెలుగు దేశం పార్టీ 42వ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా జరిగింది. తెలుగు దేశం పార్టీ నాయకులు, నందమూరి అభిమానులు ఎన్‌టీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేసి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. పార్టీని స్థాపించి అనతికాలంలోనే అధికారంలోకి వచ్చిన ఘనత ఎన్‌టీఆర్‌దేనని ప్రశంసించారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి విఠల్, నాయకులు రాజారావు, వినోద్, ఇందూరు సాయిలు, వెంకటేష్, చక్రధర్ రావు, సత్యనారాయణ, దేవయ్య, తదితరులు పాల్గొన్నారు.

'మాస్ కాపీయింగ్ జరగకుండా చర్యలు'

బోధన్ రూరల్, మార్చి 29: బోధన్ , సాలూర మండలాలలోని పదవ తరగతి పరీక్ష కేంద్రాలలో ఎటువంటి మాస్ కాపీయింగ్ జరుగకుండా పకడ్బందీ చర్యలు చేపట్టాలని బోధన్ ఎంఈఓ నాగనాథ్ అన్నారు. శుక్రవారం ఆయన పదవ తరగతి పరీక్ష కేంద్రాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదవ తరగతి పరీక్ష కేంద్రాల్లో అపరిచిత వ్యక్తులను లోపలికి పంపించవద్దని సూచించారు. మాస్ కాపీయింగ్ జరుగకుండా పకడ్బందీ చర్యలు చేపడుతున్నామని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. విద్యార్థులు కష్ట పడి కాకుండా ఇష్ట పడి చదివి పదవ తరగతిలో ఉత్తీర్ణత సాధించాలని ఆయన పేర్కొన్నారు.

నేడు బీఆర్ఎస్ నాయకుల సమావేశం

ముప్కాల్, మార్చి 29: బాల్కొండ మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో శనివారం ఉదయం 11గంటలకు ఉమ్మడి బాల్కొండ మండల బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు సమావేశం నిర్వహించనున్నట్టు పార్టీ మండల అధ్యక్షుడు బద్దం ప్రవీన్‌రెడ్డి శుక్రవారం తెలిపారు. నిజామాబాద్ పార్లమెంట్ ఎన్నికల దృష్ట్యా ముఖ్య అతిథులుగా బాజిరెడ్డి గోవర్ధన్, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డిలు హాజరు కానున్నట్టు తెలిపారు. అనంతరం బాల్కొండ మండల కేంద్రంలో సాయంత్రం జరిగే ఇఫ్తార్ విందు కార్యక్రమంలో వారు పాల్గొనున్నట్టు ఆయన తెలిపారు.

మోదీని మూడోసారి ప్రధాని చేయడమే లక్ష్యం: ఎంపీ అరవింద్


మాట్లాడుతున్న ఎంపీ అరవింద్

బోధన్ రూరల్, మార్చి 29: మోదీని మూడోసారి ప్రధాని చేయడమే లక్ష్యమని బీజేపీ ఎంపీ అభ్యర్థి అరవింద్ అన్నారు. శుక్రవారం బోధన్‌లో బీజేపీ నియోజకవర్గ కార్యకర్తలతో అంతర్గత ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ కార్యకర్త పార్టీ గెలుపునకు కృషి చేయాలన్నారు. ఎన్నికల్లో సైనికుల్లా పని చేసి పార్టీని గెలిపించుకునే బాధ్యత ప్రతీఒక్కరిపై ఉందన్నారు. మోదీ హ్యాట్రిక్ ప్రధాని కావడం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షులు దినేష్ కులాచారి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మేడపాటిప్రకాష్ రెడ్డి, వడ్డీ మోహన్ రెడ్డి, పార్లమెంట్ ఇన్‌చార్జి వెంకట రమణి, పార్లమెంట్ కన్వీనర్ గద్దె భూమన్న, జిల్లా ఉపాధ్యక్షులు మేక సంతోష్, జిల్లా కార్యదర్శి మారోజు సుధాకర్ చారి, అసెంబ్లీ కన్వీనర్ శ్రీధర్, వివిధ మండలాల అధ్యక్షులు ఉన్నారు.

నేడు అవిశ్వాస తీర్మానంపై సమావేశం

డిచ్‌పల్లి, మార్చి29: డిచ్‌పల్లి మండలపరిషత్ అధ్యక్షుడు గద్దెభూమన్న అలియాస్ శ్రీనివాస్‌పై శనివారం మధ్యాహ్నం 3 గంటలకు ఆర్‌డీవో నిజామాబాద్ రాజేంద్రకుమార్ ఆధ్వర్యంలో ఎంపీపీపై వచ్చిన అవిశ్వాస తీర్మానంపై ప్రత్యేక సమావేశం ఉంటుందని శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి అన్ని గ్రామాల ఎంపీటీసీ సభ్యులు హాజరుకావాలని, ఎంపీపీ ఆవరణలో 144 సెక్షన్ అమల్లో ఉంటుందని ఎంపీడీవో అనిల్ కుమార్ పేర్కొన్నారు.


సీఎం రేవంత్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న డీసీసీబీ చైర్మన్ రమేష్‌రెడ్డి

సీఎంని కలిసిన డీసీసీబీ చైర్మన్

ఆర్మూర్ రూరల్, మార్చి 29: ఇటీవల డీసీసీబీ చైర్మన్‌గా ఎన్నికైన కుంట రమేష్‌రెడ్డి శుక్రవారం సీఎం రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. బోదన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి సమక్షంలో సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి పుష్పగుచ్ఛం అందజేసి సన్మానించారు. అదే విధంగా కాంగ్రెస్ నాయకులు కుంట రవీంధర్‌రెడ్డి సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి సన్మానించారు. ఇటీవల బీఆర్ఎస్ పార్టీ నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరారు.

డొంకేశ్వర్: పార్లమెంట్ అభ్యర్థితో కలిసి సీఎం రేవంత్‌రెడ్డిని డీసీసీ వైస్‌చైర్మన్ దేగం గంగారెడ్డి కలిశారు. శుక్రవారం హైదరాబాద్‌లోని సీఎం రేవంత్‌రెడ్డిని ఆయన కలిసి శాలువతో సత్కరించారు. రానున్న ఎన్నికల్లో ఎంపీ అభ్యర్థి గెలుపు కోసం జిల్లా కాంగ్రెస్ నాయకులు కృషి చేయాలని సీఎం కాంగ్రెస్ పార్టీ నాయకులకు తెలిపారు.

ముప్కాల్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శుక్రవారం వేంపల్లి సొసైటీ చైర్మన్ జక్క రాజేశ్వర్ మర్యాద పూర్వకంగా కలిశారు. హైదరాబాద్‌లోని తన నివాసంలో రేవంత్‌రెడ్డిని కలిసి శాలువతో సత్కరించి నాగలిని బహుకరించారు. ఈ సందర్భంగా వేంపల్లి సొసైటీలో ఉన్న సమస్యలపై చర్చించినట్టు ఆయన తెలిపారు. సొసైటీ అభివృద్ధి దృష్ట్యా నిధులు మంజూరు చేయాలని సీఎంను విన్నవించగా. ఇందుకు సీఎం రేవంత్‌రెడ్డి సానుకూలంగా స్పందించారని ఆయన తెలిపారు.


సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన డీసీసీ వైస్‌చైర్మన్ దేగం గంగారెడ్డి

సహకార సంఘాల్లో రుణ పరిమితిని పెంచాలి

● హున్సా సొసైటీ అధ్యక్షుడు మందర్న రవి ● బోధన్ డివిజన్ పరిధిలోని పలు వ్యవసాయ సహకార సంఘాలలో 88వ మహాజన సభలు ● పెద్దసంఖ్యలో పాల్గొన్న ఆయా గ్రామాల రైతులు

బోధన్ రూరల్, మార్చి29: సహకార సంఘాల్లో రైతులకు ఇచ్చే రుణ పరిమితిని పెంచాలని కొత్త సభ్యత్వాలు కల్పించాలని హున్సా సొసైటీ అధ్యక్షులు మందర్న రవి అన్నారు. శుక్రవారం సాలూర మండల కేంద్రంలోని హున్స సహకార ంఘంలో మహాజన సభ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రకటించిన రెండు లక్షల రూపాయల రుణమాఫీని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. సొసైటీ కార్యలయం కాంపౌండ్ వాల్ నిర్మాణం చేపట్టాలని సంఘ సభ్యులందరూ ఏకగ్రావ తీర్మాణం చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు కులకర్ణి వినోద్ బాబా, డైరెక్టర్లు ఖాజాపూర్ అశోక్, బి.రమేష్, డి. రాములు, బుద్ద సంగ్రాం, సిద్దార్థ్, సొసైటీ సీఈఓ ముద్ద హన్మంత్‌రావు, హున్సా మందర్న, ఖాజాపూర్ గ్రామాల రైతులు, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

●'ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలి'

రుద్రూరు: రైతులు పండించిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేసే విధంగా చూడాలని 88వ మహాజనసభలో రైతులు డిమాండ్ చేశారు. శుక్రవారం రుద్రూరు మండల కేంద్రంలోని వ్యవసాయ సహకార సంఘం సమావేశాన్ని చైర్మన్ సంజీవ్‌రెడ్డి అధ్యక్షతన కార్యాలయంలో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో కార్యదర్శి సంఘానికి సంబంధించి ఆరు నెలలకు సంబంధించిన ఆదాయ వ్యయాలను సభ్యుల సమక్షంలో చదివి వినిపించారు. ఈ సందర్భంగా సహకార సంఘం చైర్మన్ సంజీవ్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ ఉత్తర్వులు రాగానే ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తామని ఈ సందర్భంగా రైతులకు హామీనిచ్చారు. సహకార సంఘం అభివృద్ధి చెందేలా ప్రతి ఒక్కరు సహకరించాలని కోరారు. రుణమాఫీ అయిన రైతులకు తిరిగి సహకార సంఘం ఆధ్వర్యంలో మళ్ళీ రుణాలు అందించాలని రైతులు కోరారు. సహకార సంఘం చైర్మన్ ఆధ్వర్యంలో నూతన గోదాం నిర్మించినందుకు రైతులు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ అక్కపల్లి సుజాత నాగేందర్, జడ్పీటీసీ నారోజీ గంగారాం, డైరెక్టర్లు గజేందర్, అశోక్, గోపి, గంగారాం, లలిత, గంగారాం, సీఈవో జి.లక్ష్మణ్, అక్కపల్లి నాగేందర్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

● 'ఏకకాలంలో పంట రుణాలను మాఫీ చేయాలి'

నవీపేట: రాష్ట్ర ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీ మేరకు ఏకకాలంలో 2లక్షల రూపాయల పంట రుణాలను మాఫీ చేయాలని నాగేపూర్ సొసైటీ మహజన సభలో తీర్మానించారు. శుక్రవారం ఫకీరాబాద్‌లోని సొసైటీ కార్యాలయం ఆవరణలో చైర్మన్ శైలేష్ కుమార్ దేశ్‌ముఖ్ అధ్యక్షతన మహజన సభను నిర్వహించారు. ఈ సందర్భంగా పలు తీర్మానాలను ఆమోదించారు. యాసంగి పంటలకు సంబంధించి త్వరలో ఏర్పాటు చేయబోయే కొనుగోలు కేంద్రాల ద్వారా సేకరించిన ప్రతి క్వింటాలు ధాన్యానికి ప్రభుత్వం మద్దతు ధర చెల్లించడంతో పాటు 500రూపాయల చొప్పున అదనంగా బోనస్ చెల్లించాలని తీర్మానించారు. సెప్టెంబర్ 2023నుండి ఫిబ్రవరి 2024వరకు ఆరు మాసాల పాటు సొసైటీలో జరిగిన జమ, ఖర్చుల వివరాలను కార్యదర్శి రమేష్ సభ్యులకు చదివి వినిపించారు. సొసైటీ 4.38లక్షల రూపాయల లాభాలతో కొనసాగుతుందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ శైలేష్ కుమార్ దేశ్‌ముఖ్, డైరెక్టర్లు శ్రీనివాస్ రావు, బేగరి సాయిలు, రాజలింగం రవీందర్, వీరన్న, నీలం సాయిలు, అంబర్ సింగ్, సంఘం సభ్యులు పాల్గొన్నారు.

● పాలకవర్గాన్ని రద్దు చేయకపోవడంపై ఆగ్రహం

కోటగిరి: పొతంగల్ విండో పాలకవర్గాన్ని రద్దు చేయాలని గత జనరల్ బాడీ సభలో తీర్మానం చేసిన అదే పాలకవర్గం కొనసాగించడంపై సభ్యులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సంఘం లావాదేవీల్లో పెద్ద ఎత్తున అవినీతి, అక్రమాలు చోటు చేసుకున్నాయని, తక్షణమే విండో కార్యదర్శితో పాటు పాలకవర్గాన్ని రద్దు చేయాలని మరోమారు సభ్యులు డిమాండ్ చేశారు. పొతంగల్ విండో మహజన సభ శుక్రవారం విండో అధ్యక్షులు, డీసీసీబీ డైరెక్టర్ శాంతేశ్వర్ పటేల్ అధ్యక్షతన నిర్వహించారు. సమావేశం ప్రారంభం కాగానే సభ్యుల నుంచి తీవ్రస్థాయిలో నిరసన వ్యక్తమైంది. గతంలో చేసిన తీర్మానాలను అమలు చేయకపోవడంపై సభ్యుల నుంచి తీవ్ర ఆగ్రహం వ్యక్తమైంది. పాలకవర్గాన్ని రద్దు చేయాలని తీర్మానం చేస్తే విండో అధ్యక్షులు కోర్టు నుంచి స్టే తీసుకురావడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. సంఘంలో కోట్ల రూపాయల ఇన్‌కమ్ ట్యాక్స్, సేల్ ట్యాక్స్ సకాలంలో చెల్లించకపోవడంతో సంఘానికి తీవ్ర నష్టం జరిగిందన్నారు. రైస్ మిల్ తౌడు సైతం లెక్కలు లేకుండా పోయ్యాయన్నారు. బ్యాంకులో 12లక్షలు, పీఎఫ్‌లో 7లక్షలు నిధులు ఏమయ్యాయని ప్రశ్నించారు. బియ్యం దుకాణాల్లోనూ లెక్కలు సక్రమంగా లేకపోవడంపై సభ్యులు తీవ్రంగా మండిపడ్డారు. సంఘంలో లావాదేవీలపై సమగ్ర విచారణ జరిపించాలని సభ్యులు డిమాండ్ చేశారు. ప్రస్తుత పాలకవర్గాన్ని రద్దు చేయాలని మరోమారు తీర్మానం చేశారు. విండో కార్యదర్శిపై తక్షణమే ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని సభ్యులు డిమాండ్ చేశారు. సహకార సంఘం అభ్యున్నతి కోసం ఏర్పాటు చేసిన సలహా కమిటీకి సొసైటీ నిర్వహణ బాధ్యతలు అప్పగించాలని ఏకగ్రీవంగా తీర్మానించారు. ఇందులో విండో పాలకవర్గ సభ్యులు, మాజీ జడ్పీటీసీ శంకర్, మాజీ ఎంపీపీ పవన్, సభ్యులు విజయ్ పటేల్, వాసు, తదితరులు పాల్గొన్నారు.


హున్సా మహాజన సభలో మాట్లాడుతున్న సొసైటీ అధ్యక్షుడు రవి


రుద్రూరులో మాట్లాడుతున్న సొసైటీ చైర్మన్ సంజీవ్‌రెడ్డి


నాగేపూర్ సొసైటీలో మాట్లాడుతున్న చైర్మన్ శైలేష్‌కుమార్ దేశ్‌ముఖ్


పొతంగల్ విండో చైర్మన్‌పై మండిపడుతున్న సభ్యులు

భక్తిశ్రద్ధల మధ్య గుడ్‌ఫ్రైడే వేడుకలు

బోధన్ రూరల్/ ఎడపల్లి, మార్చి 29: బోధన్ పట్టణం, బోధన్, సాలూర, ఎడపల్లి మండలాల వ్యాప్తంగా గుడ్ ఫ్రైడే వేడుకలను క్రైస్తవ సోదర, సోదరీమణులు ఘనంగా జరుపుకుని, చర్చిలలో ప్రార్థనలు నిర్వహించారు. ఏసుక్రీస్తు శిలువ వేయబడిన రోజును స్మరించుకుంటూ బోధన్ పట్టణంలోని రాకాసిపేట, ఆచన్‌పల్లి, జాడిజమాల్ పూర్ గ్రామాలతో పాటు ఎడపల్లి మండల కేంద్రంలోని బెతానియా ఫెలోషిప్ చర్చితో పాటు వడ్డాపల్లి, ఎమ్మెస్సీ ఫారం, పోచారం, ఏఆర్పీ క్యాంపు గ్రామాలలో గుడ్ ఫ్రైడేను శుక్రవారం భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. ఏసు క్రీస్తు శిలువలో చివరగా పలికిన ఏడు మాటలను ఎడపల్లి చర్చి ఫాదర్ తిమోతి రాజు భక్తులకు బోధించి గుడ్ ఫ్రైడే అవశ్యకతను తెలియజేశారు. క్రీస్తు మరణించి తిరిగి లేచిన దినాన్ని పురస్కరించుకుని ఆదివారం ఈస్టర్ వేడుకలను నిర్వహించనున్నట్లు ఫాస్టర్ తిమోతి రాజు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాలలోని క్రైస్తవులు పాల్గొన్నారు. అనంతరం చర్చిల దగ్గర అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

జక్రాన్‌పల్లి: మండలంలోని అన్ని గ్రామాలలో శుక్రవారం గుడ్‌ఫ్రైడేను క్రైస్తవులు ఘనంగా జరుపుకున్నారు. జక్రాన్‌ల్లి, అర్గుల్, బ్రహ్మణ్‌పల్లి, తొరికొండ, పడకల్, కొలిప్యాక్, తదితర గ్రామాల్లో చర్చీలలో క్రైస్తవ సోదరులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ఒకరినోకరు గుడ్‌ఫ్రైడే జరుపుకున్నారు. ఫాస్టర్‌లు, క్రిస్టియన్ సోదరులు, తదితరులు పాల్గొన్నారు.


రాకాసిపేట్ చర్చిలో ప్రార్థనలు చేస్తున్న దృశ్యం

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

నవీపేట, మార్చి29: మండలంలోని రాంపూర్, నవీపేట, కమలాపూర్, కోస్లీ, యంచ సబ్ స్టేషన్ పరిధిలోని గ్రామాలలో శనివారం విద్యుత్తు సరఫరాకు అంతరాయం ఏర్పడనుందని ట్రాన్స్‌కో ఏడీఈ సుహాసిని, ఏఈఈ ప్రవీణ్ కుమార్‌లు తెలిపారు. 4వ శనివారంను పురస్కరించుకుని ఆయా సబ్ స్టేషన్‌లలో చేపట్టబోయే మరమ్మతుల కారణంగా మధ్యాహ్నం 3గంటల నుండి సాయంత్రం 6గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని, ఆయా సబ్ స్టేషన్ పరిధిలోని గ్రామాల విద్యుత్ వినియోగదారులు విద్యుత్ సరఫరా అంతరాయానికి సహకరించాలని వారు కోరారు.


డిప్యూటి డీఎంహెచ్‌వోకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

మరణించిన ఆశా కార్యకర్తకు రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలి

● సీఐటీయూ నాయకుల డిమాండ్

ఎడపల్లి, మార్చి 29: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో విధులు నిర్వహించి పని నిమిత్తం బయటకు వచ్చిన ఆశా వర్కర్ అబ్బుమ్మ గురువారం రోడ్డు ప్రమాదంలో మృతి చెందిందని, మృతి చెందిన అబ్బుమ్మ కుటుంబానికి రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియా అందించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం సీఐటీయూ మండల శాఖ ఆధ్వర్యంలో ఉప జిల్లా వైద్యాధికారి విద్యకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు జమ్మిశెట్టి శంకర్ గౌడ్ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదంలో మరణించిన ఆశా కార్యకర్తకు రూ.50 లక్షల ఎక్స్ గ్రేషియా అందించాలని, ఆశా వర్కర్లందరినీ పర్మినెంట్ చేయాలని, ఆశా వర్కర్లకు కనీస వేతనం రూ.18 వేలు ఇవ్వాలని, మరణించిన కార్మికురాలి కుటుంబంలో ఒకరికి ఆశా వర్కర్ ఉద్యోగం ఇవ్వాలని, మట్టి ఖర్చుల నిమిత్తం రూ.20వేలు ఇవ్వాలని, భవిష్యత్తులో ఇలాంటి సమస్యలు జరుగకుండా ప్రభుత్వం పరిష్కారం చూపాలని వారు డిమాండ్ చేస్తూ వినతిపత్రం అందించారు. ప్రభుత్వం ఈ సమస్యలన్నిటినీ పరిష్కారం చేయలేని పక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఆశా వర్కర్ల యూనియన్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు, పోరాటాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆశా వర్కర్ జిల్లా నాయకురాలు గైని రాజమణి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ఏశాల గంగాధర్, జిల్లా నాయకులు జంగం గంగాధర్, కటారి రాములు, ఆశా వర్కర్ల వివిధ మండలాల అధ్యక్షులు, కార్యదర్శులు అనసూయ, రాజేశ్వరి, పద్మ, సుజాత, తదితరులు ఉన్నారు.

లక్ష్యాన్ని చేరుకున్న జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రం

● పోచంపాడ్‌లో 75.16 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి ● జెన్‌కో ఇంజనీర్లు, సిబ్బందికి చీఫ్ ఇంజనీర్ అభినందనలు

మెండోర, మార్చి 29: శ్రీరాంసాగర్ ప్రాజెక్టు రిజర్వాయర్ ప్రధాన కాలువ కాకతీయకు అనుసంధానంగా ఉన్న పోచంపాడ్ జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రం ఈ ఆర్థిక సంవత్సరంలో నిర్దేశించుకున్న లక్ష్యాన్ని చేరుకుందని చీఫ్ ఇంజనీర్ రమేష్‌బాబు సంతోషం వ్యక్తం చేశారు. ఈ సంవత్సరం ఈ ఆర్థిక సంవత్సరంలో 75మిలియన్ యూనిట్ల విద్యుత ఉత్పత్తిని ఏర్పాటు చేయాలని ఉన్నత అధికారులు నిర్దేశించారు. దీంతో ఖరీఫ్, రవి పంటలకు కాకతీయ కాలువ నుంచి విడుదల చేసిన నీటిని జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రం ద్వారా విడుదల చేసి విద్యుత్ ఉత్పత్తిని పూర్తిస్థాయిలో చేయగలిగారు. జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రంలో నాలుగు టార్బయిన్లు ఉండగా ఒక్కో టార్బయిన్ ద్వారా తొమ్మిది మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి, నాలుగు టార్బయిన్‌ల ద్వారా 36మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తిని చేయగలుగుతుంది. పోచంపాడ్ జలవిద్యుత్ ఉత్పత్తి కేంద్రంలో 1987జులై 12వ తేదీన ఒక్కో టార్బయిన్ ద్వారా విద్యుత్ ఉత్పత్తి కొనసాగింది. 1987 అక్టోబర్ 24వ తేదీన రెండో టార్బయిన్ ద్వారా రెండు విద్యుత్ ఉత్పత్తి కొనసాగింది. 1988 మార్చి 31వ తేదీన మూడో టర్బాయిన్ ద్వారా విద్యుత్ ఉత్పత్తి జరిగింది. 2010 అక్టోబర్ 12వ తేదీన నాలుగు టార్బయిన్ ద్వారా విద్యుత్ ఉత్పత్తిని ప్రారంభించి కొనసాగించారు. విద్యుత్ ఉత్పత్తి ప్రారంభించిన తర్వాత ఉత్పత్తి కేంద్రంలో 1989-90సంవత్సరంలో 125.45మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి, 1998-99సంవత్సరంలో 137.95మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి, 1990-91లో 146.4మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి, 2022-23లో 138.42మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి జరిగింది. ఇందులో రికార్డు విద్యుత్ ఉత్పత్తి 146.4మిలియన్ ఉత్పత్తి జరిగిందని తెలిపారు.



పోచంపాడ్ జలవిద్యుత్ కేంద్రంలో టర్బాయిన్లు

● జెన్‌కో ఇంజనీర్లు, సిబ్బందికి అభినందనలు

పోచంపాడ్ జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రంలో నిర్దేశించిన లక్ష్యాన్ని చేరుకోవడంలో చీఫ్ ఇంజనీర రమేష్‌బాబు శుక్రవారం జలవిద్యుత్ ఉత్పత్తి కేంద్రంలో ఇంజనీర్లు, సిబ్బందిని అభినందించారు. నిర్దేశించిన లక్ష్యాన్ని 75.16మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి అధికమించడంతో ఇంజనీర్లు సిబ్బంది కృషి వెలకట్టలేనిదని అన్నారు.

'ప్రజలకు విలువ ఇచ్చే వారికే ఓటు వేయండి'

నందిపేట, మార్చి 29: రాజకీయ పరంగా ప్రజలకు విలువ ఇచ్చే వారికే ఓటు వేయాలని బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ కోరారు. శుక్రవారం నందిపేట మండల కేంద్రంలోని నందీశ్వర ఆలయంలో రాజ్యసభ సభ్యుడు కేఆర్.సురేష్‌రెడ్డి, జిల్లా పరిషత్ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు, ఆర్మూర్ మాజీఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డి, మాజీఎమ్మెల్సీ వీజీ.గౌడ్‌లతో కలిసి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ఆలయం నుంచి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పాతబస్టాండ్ నుంచి కొత్త బస్టాండ్ మీదుగా జమ మసీదు వరకు ఉన్న వ్యాపార సముదాయాల వెంట వ్యాపారస్తులను, అలాగే కూలీలను కలుస్తూ ఓట్లను అభ్యర్థించారు. హెయిర్‌కటింగ్ సెలూన్‌లో కటింగ్ చేస్తూ, అలాగే హోటల్‌లో టీ తాగుతూ ఓట్లను అభ్యర్థించారు. అనంతరం సాయిబాబా ఫంక్షన్‌హాల్‌లో జరిగిన సమావేశంలో ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ మాట్లాడుతూ ఓటు హక్కు అమూల్యమైందని ఆ ఓటు గుర్తింపు ఉన్న వారికే వేయాలని కోరారు. నిజామాబాద్ పార్లమెంట్ సభ్యుడు ధర్మపురి అర్వింద్, ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డిలకు విలువలు లేవని, అసలు వారు మాట్లాడే బాష విడ్డూరంగా ఉందని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి వంద రోజులు దాటిన ఆరు గ్యారంటీలు పూర్తిస్థాయిలో ఇప్పటికీ అమలు కాలేదని ఆయన విమర్శించారు. ప్రజలు బీజేపీకి, కాంగ్రెస్‌కు ఓటు ఎందుకు వేశామని మదన పడుతున్నారని, తమ దగ్గరికి వచ్చి తప్పయ్యిందని గగ్గోలు పెడుతున్నారని బాజిరెడ్డి గోవర్ధన్ తెలిపారు. ఇకనైనా సమర్థులైన అభ్యర్థికి ఓటు వేయాలని వారికి సూచించానని, గత పదేళ్లలో జరిగిన అభివృద్ధిని అందించిన పథకాలను చూసి ఓట్లు వేయాలని బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ తెలిపారు. అంతకు ముందు రాజ్యసభ సభ్యుడు కేఆర్. సురేష్‌రెడ్డి మాట్లాడుతూ ఆర్మూర్, బాల్కొండ నియోజకవర్గాలు సస్యశ్యామలం కావడానికి తానే కారణమని ఉమ్మడి రాష్ట్రంలో పలు మార్లు ఎమ్మెల్యేగా పని చేసిన నేను ప్రతీ గ్రామానికి సాగునీరు అందించడానికి ఏఐబీపీ, నాబార్డు నిధులతో ఎత్తిపోతల పథకాలను నిర్మించినట్టు వెల్లడించారు. బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆర్మూర్ మాజీఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డి, మాజీఎమ్మెల్సీ వీజీ.గౌడ్‌లు మాట్లాడుతూ రాష్ట్రంలో జరిగిన అభివృద్ధి పనులను, ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల గురించి వివరించారు. కార్యక్రమంలో ఎంపీపీ వాకిడి సంతోష్‌రెడ్డి, మండల అధ్యక్షుడు మచ్చర్ల సాగర్, పట్టణ అధ్యక్షుడు కొత్తూరు బాస్కర్, కోఆప్షన్‌సభ్యుడు సయ్యద్, మాజీసర్పంచ్‌లు, తదితరులు ఉన్నారు.


నందీశ్వర ఆలయంలో పూజలు చేస్తున్న బీఆర్ఎస్ అభ్యర్థి బాజిరెడ్డి


..ప్రచారం నిర్వహిస్తున్న ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్



బర్ధిపూర్ చర్చిలో ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు



బోధనలు చేస్తున్న దృశ్యం

భక్తిశ్రద్ధలతో గుడ్ ఫ్రైడే

డిచ్‌పల్లి, మార్చి 29: డిచ్‌పల్లి మండలంలోని బర్ధిపూర్, ధర్మారం(బీ) చర్చిలలో గుడ్‌ఫ్రైడేను పురస్కరించుకొని క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ధర్మారం చర్చిలో పలువురు క్రైస్తవులు శిలువను మోసి వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా బర్ధిపూర్ చర్చి ఫాదర్ దనకర్ మాట్లాడుతూ పాపపరిహారం కోసం శిలువను మోయడం గుడ్‌ఫ్రైడే రోజు ప్రతీయేటా ఆనవాయితీగా వస్తుందని పేర్కొన్నారు. అనంతరం చర్చి వద్ద అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో చర్చి ప్రతినిధులు దేవరాజు, పద్మారావు, ఇందిర, రమేష్, సుప్రియ, ప్రియాసాగర్, గ్రామస్థులు పాల్గొన్నారు.

బీడీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

పెద్దబజార్, మార్చి29: బీడీ పరిశ్రమలలో పనిచేస్తున్న అన్ని తరగతుల కార్మికులకు కూలీరేట్లు, వేతనాలు 65 శాతం పెంచి వారి సమస్యలను పరిష్కరించాలని నిజామాబాద్ బీడీ మజ్దూర్ సంఘ్ కార్యదర్శి కెఎస్ స్వామి అన్నారు. శుక్రవారం నగరంలోని తెలంగాణ బీడీ యజమానుల అసోసియేషన్ సంఘ నాయకులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కనీస వేతనం పెంచాలని తెలంగాణలోని ఉమ్మడిజిల్లాలు బీడీకార్మికులకు నెలసరి ఉద్యోగాలు, తదితర అన్ని తరగతుల కార్మిక వర్గానికి కూలీరేట్లు పెంచాలన్నారు. వర్ది బీడీ రద్దు చేయాలని కరువు భత్యం పాయింట్ పెంచాలని పనికి తగిన తునికాకు సరఫరా చేయాలన్నారు. కార్మికులు అనేక ఏళ్లుగా పనిచేసి పదవీవిరమణ చేసిన సమయంలో పొందే గ్రాడ్యుటీ చెల్లింపులో అన్యాయం జరుగుతుందన్నారు. కార్మికులకు యాజమాన్యాలు నెలకు 26రోజులు పనిదినం కల్పించాలని అన్నారు. బీడీ కార్మికులు తన ప్రసూతి ముందు 3నెలల తర్వాత మూడు నెలలు సెలవులు ఇచ్చి వేతనం చెల్లించాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు రెంజర్ల తారా, రాజన్న, తదితరులు పాల్గొన్నారు.

మహిళ మెడలోంచి గొలుసు అపహరణ

ఖిల్లా, మార్చి 29: నగరంలోని నాల్గో టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో గల యెండల టవర్స్ వద్ద మహిళ మెడలోంచి గుర్తుతెలియని వ్యక్తులు బంగారు గొలుసును లాక్కుని పారిపోయారు. మోపాల్ మండలానికి చెందిన ఓ మహిళ శుక్రవారం ఆటోలో వెళ్తుండగా గుర్తు తెలియని వ్యక్తులు బైక్‌పై వచ్చి మెడలోంచి బంగారు గొలుసు ను లాక్కుని పరారయ్యారు. సదరు మహిళ ఈ విషయాన్ని నాల్గో టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి సీసీ టీవీ దృష్యాల ఆధారంగా నిందితుల కోసం పోలీసులు గాలిస్తున్నట్లు ఎస్సై సంజీవ్ తెలిపారు.

'రూ.2లక్షల రుణమాఫీని అమలుచేయాలి'

డిచ్‌పల్లి, మార్చి 29: కాంగ్రెస్ ప్రభుత్వంతోనే రైతులకు న్యాయం జరుగుతుందని, ప్రభుత్వం వెంటనే రూ.2లక్షల రుణమాఫీని అమలు చేయాలని డిచ్‌పల్లి విండో సమావేశం ఏకగ్రీవంగా శుక్రవారం తీర్మానం చేసింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగాహాజరైన చైర్మన్ రాంచందర్‌గౌడ్ మాట్లాడుతూ రైతాంగానికి క్వింటా ధాన్యానికి రూ.500 బోనస్ ఇవ్వాలని, ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో నీరు, టెంట్ సౌకర్యం ఏర్పాటు చేస్తున్నామని రైతులకు బీమా, రుణసదుపాయాన్ని తక్షణం అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో సొసైటీ డైరెక్టర్లు సతీష్‌రెడ్డి, రాము, లత, గంగారెడ్డి, హరిచంద్, సూపర్‌వైజర్ మోహన్‌రెడ్డి, మాజీ సర్పంచ్ సుదర్శన్, సీఈవో కిషన్, రైతులు పాల్గొన్నారు.

'టీయూలోని సమస్యలను పరిష్కరించాలి'

డిచ్‌పల్లి, మార్చి29: తెలంగాణ విశ్వవిద్యాలయంలో నెలకొన్న మౌలిక సమస్యల పరిష్కారానికి శుక్రవారం గిరిజన శక్తి ఆధ్వర్యంలో రౌండ్‌టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో అధ్యక్షుడు సీనునాయక్ మాట్లాడుతూ వివిధ పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్న విద్యార్థులకు గ్రంథాలయంలో సరైన పుస్తకాలు అందుబాటులో ఉండే విధంగా చూడాలని డిమాండ్ చేశారు. అంతేకాకుండా హెల్త్ సెంటర్‌లో 24గంటల పాటు వైద్య సదుపాయాలు అందించే విధంగా చర్యలు తీసుకోవాలని, ఇరుకుగా మారిన బాలికల వసతి గృహాన్ని నూతన వసతిగృహం నిర్మించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో నరేష్ నాయక్, నిఖిల్ నాయక్, శివనాయక్, సంజయ్ నాయక్, కృష్ణ, శ్రీకాంత్, సూర్య, తదితరులు పాల్గొన్నారు.

సాఫ్ట్‌బాల్ పోటీలకు చీమన్‌పల్లి విద్యార్థి ఎంపిక

సిరికొండ, మార్చి29: మండలం చీమన్‌పల్లి హైస్కూల్ విద్యార్థి మాలవత్ నితీన్ మహారాష్ట్రలోని ఔరంగబాద్ పట్టణంలో జరుగుతున్న సాఫ్ట్‌బాల్‌పోటీలలో రాష్ట్రజట్టు తరపున ఆడనున్నట్లు వ్యాయామ ఉపాధ్యాయులు నవీన్ తెలిపారు. భువనగిరి జిల్లా ఆలేరులో జరిగిన రాష్ట్రస్థాయి పోటీలో నితీన్ ప్రతిభకనబర్చి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. ఏప్రిల్ ఒకటి వరకు మహారాష్ట్రలోని ఔరంగాబాద్ పట్టణంలోని చత్రపతి శివాజీ క్రీడా మైదానంలో జరుగుతున్న పోటీలలో రాష్ట్ర జట్టు తరపున నితీన్ పాల్గొంటున్నారని నవీన్ చెప్పారు. పాఠశాలలో నితీన్ ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్ అభినందించి మెమొంటోను అందజేశారు.

ఉపాధ్యాయుల అపూర్వ సమ్మేళనం

నిజామాబాద్ అర్బన్, మార్చి 29: 1987-88 సంవత్సరంలో నిజామాబాద్‌లో టీచర్స్ ట్రైనింగ్ చేసిన పూర్వ విద్యార్థులు శుక్రవారం నగరంలో అపూర్వ సమ్మేళనం నిర్వహించి కలుసుకున్నారు. ఈ సందర్భంగా 35 సంవత్సరాల క్రితం నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ ఆనందంగా గడిపారు. ఉపాధ్యాయ శిక్షణలో తీపి గుర్తులను నెమరు వేసుకున్నారు. ఒకరినొకరు ఆలింగనం చేసుకొని కష్టనష్టాలను పంచుకున్నారు. కార్యక్రమంలో పుష్పాకర్‌రావు, అశోక్, శ్రీనివాస్‌రెడ్డి, శ్రీహరి, సుజాత, ఇందిర, లక్ష్మి, విజయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌టీఆర్‌కు భారత రత్న ఇవ్వాలి

● టీడీపీ పార్లమెంటరీ అధ్యక్షుడు దేగాం యాదాగౌడ్



కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకుంటున్న నాయకులు

సుభాష్‌నగర్, మార్చి 29: తెలుగు ప్రజల గుర్తింపు కోసం పార్టీని స్థాపించి, వారిని చైతన్య పరుస్తూ గొప్ప పాలనను అందించిన మహా నాయకుడు ఎన్‌టీఆర్‌కు భారతరత్న ఇవ్వాలని టీడీపీ పార్లమెంటరీ అధ్యక్షుడు దేగాం యాదాగౌడ్ డిమాండ్ చేశారు. తెలుగుదేశం పార్టీ 42వ ఆవిర్భావ దినోత్సవాన్ని జిల్లా కార్యాలయంలో శుక్రవారం పార్లమెంటరీ అధ్యక్షుడు దేగాం యాదాగౌడ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. వేడుకల్లో భాగంగా తెలుగుదేశం పార్టీ జెండా ఆవిష్కరించి ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా దేగాం యాదాగౌడ్ మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ పుట్టుక ఒక నవశకమని అన్నారు. తెలుగువారికి గుర్తింపు లేని సమయంలో ఎన్టీఆర్ తెలుగుదేశం పార్టీ స్థాపించి ప్రజలను చైతన్యపరుస్తూ ప్రపంచస్థాయిలో గుర్తింపు తెచ్చారని అన్నారు. వెట్టిచాకిరి వ్యవస్థను రూపుమాపి మరో స్వాతంత్రం తెచ్చారని అన్నారు. తెలంగాణలో నేడు మనం చూస్తున్న అభివృద్ధి కేవలం టీడీపీ హయాంలోనే జరిగిందని గుర్తుచేశారు. పదేళ్ల కేసీఆర్ అనే నియంత, వారి కుటుంబం దేశంలో ఎవరూ చేయనంత అవినీతికి పాల్పడి కోట్ల సొమ్మును దోచుకున్నారని, ప్రస్తుతం దాని పరిహారం అనుభవిస్తున్నారని అన్నారు. గత ప్రభుత్వంలో జరిగిన అవినీతిని సీఎం రేవంత్‌రెడ్డి బయటపెట్టాలని అన్నారు. కార్యక్రమంలో అర్బన్ ఇన్‌చార్జి వినోద్‌కుమార్, బోధన్ నియోజకవర్గ ఇంచార్జి కోటగోపాల్‌రెడ్డి, పార్లమెంట్ జనరల్‌సెక్రెటరీ వెంజర్ల సురేష్, అనుబంధ సంఘాల అధ్యక్షులు దంతాల ఆనంద్, బొబ్బ నర్సింహారావు, మండల అధ్యక్షుడు చింతసత్యనారాయణ, పసూల రాజు, అర్బన్ సీనియర్ నాయకులు కల్లెడ గంగాధర్, శంకర్ ముదిరాజ్, లవంగరాజు, అర్సపల్లి అశోక్, రవికుమార్‌పాటిల్, మల్లరెడ్డి, రాములు, రాజేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.



కీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఆర్మూర్ ఎంపీపీ

క్రీడలతో మానసిక ఉల్లాసం

డిచ్‌పల్లి, మార్చి 29: విద్యార్థులకు చదువుతోపాటు క్రీడలు కూడా ముఖ్యమని, క్రీడలతో మానసిక ఉల్లాసం లభిస్తుందని ఆర్మూర్ మండల పరిషత్ అధ్యక్షుడు పస్క నర్సయ్య అన్నారు. శుక్రవారం తెలంగాణ యూనివర్సిటీలో ఎస్ఎస్‌యుఐ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రీడాపోటీలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎస్‌యూఐ యూనివర్సిటీ అధ్యక్షుడు, సభ్యులు పాల్గొన్నారు.

క్వింటా వరికి రూ.500 బోనస్ ఇవ్వాలి

● బీఆర్ఎస్ ఆధ్వర్యంలో చేపట్టిన రైతు ధర్నాలో ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి



ధర్నాలో మాట్లాడుతున్న ప్రశాంత్ రెడ్డి

భీమ్‌గల్ రూరల్, మార్చి 29: ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ రైతులకు ఇచ్చిన హామీ ప్రకారం క్వింటాకు వరికి రూ.500 బోనస్ ఇచ్చి కొనుగోలు చేయాలని ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి డిమాండ్ చేశారు. భీమ్‌గల్ పట్టణంలోని తెలంగాణ తల్లి విగ్రహం వద్ద బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన రైతు ధర్నా కార్యక్రమం ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రస్తుతం వరికి మద్దతు ధర ఏ గ్రేడ్ రూ.2200 ధర ఉందని, రూ.500 బోనస్‌తో క్వింటాకు రూ.2700 రైతులకు చెల్లించాలని డిమాండ్ చేశారు. లేదంటే వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఓట్లు అడిగే నైతిక బాధ్యత కోల్పోతుందని అన్నారు. మా ప్రభుత్వ హయంలో జిల్లాలో 490, బాల్కొండ నియోజకవర్గంలో వందకుపైగా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశామని అన్నారు. వరి కోతలు పూర్తవుతున్నాయి కళ్లాలపై వరి కుప్పలు చేరాయని ఇప్పటివరకు గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలను ప్రభుత్వం ఏర్పాటు చేయకపోవడం విడ్డూరమని విమర్శించారు. సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీలు నెరవేర్చమంటే పేగులు మేడలో వేసుకుంటా.. కత్తెర జేబులో పెట్టుకొని తిరుగుతా.. మానవబంబులమవుతామని నోటికొచ్చిన మాటలు ఇష్టమొచ్చినట్టు అనైతిక మాటలు మాట్లాడుతు న్నాడని విమర్శించారు. ఇటువంటి చిల్లర మాటలు మానేసి రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన ప్రతీ హామీని నెరవేర్చాల సూచించారు. ఎన్నికల ముందే కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు సక్రమంగా అమలు చేయడం లేదని, ఇక పార్లమెంటు ఎన్నికల్లో ఓట్లు వేయించుకున్నక ఇచ్చిన హామీలను ఆటకెక్కించారన్నారు. బీఆర్ఎస్ పార్టీ రైతుల పక్షాన, ప్రజల పక్షాన హామీలు అమలయ్యే వరకు పోరుబాట చేస్తుందని అన్నారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



వైద్య శిబిరంలో చికిత్స అందిస్తున్న వైద్యురాలు

నడిపల్లిలో వైద్యశిబిరం ఏర్పాటు

డిచ్‌పల్లి, మార్చి 29: 'చికున్ గున్యాతో 28 మందికి అస్వస్థత' అనే శీర్షికతో ప్రచురితమైన వార్తకు ఆరోగ్యశాఖ జిల్లా అధికారులు స్పందించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆరోగ్య విస్తీర్ణ అధికారి వై.శంకర్ ఆధ్వర్యంలో శుక్రవారం గ్రామ సచివాలయం వద్ద ఆరోగ్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. చికున్‌గున్యాతో బాధపడుతున్న వారందరికి వైద్య చికిత్సలు చేసి ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని పలు అంశాలపై అవగాహన కల్పించారు. గ్రామంలో కొందరు కీళ్ల నొప్పులతో ఇబ్బందులు ఎదుర్కొన్న విషయం వాస్తవమేనని చెప్పారు. దోమలు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే వ్యాధులు దరిచేరవన్నారు. గ్రామంలో మంచి నీటి సరఫరా నాణ్యతతో జరిగే విధంగా చూడాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కిషన్, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

టీయూలో ఇన్‌చార్జి వీసీ, రిజిస్ట్రార్ దిష్టిబొమ్మల దహనం



టీయూలో వీసీ, రిజిస్ట్రార్ దిష్టి బొమ్మలను దహనం చేస్తున్న విద్యార్థులు

డిచ్‌పల్లి, మార్చి 29: పెంచిన ఫీజులను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ విశ్వవిద్యాలయంలో ఏబీవీపీ ఆధ్వర్యంలో శుక్రవారం ఇన్‌చార్జి వైస్‌చాన్సిలర్ వెంకటేశం, రిజిస్ట్రార్ యాదగిరిల దిష్టిబొమ్మలను దహనం చేశారు. ఎగ్జామినేషన్ బ్రాంచ్ నుంచి సర్టిఫికెట్లు జారీ చేయడానికి పెంచిన ఫీజును తగ్గించాలని, ఇచ్చిన సర్క్యులర్‌ను వెనక్కి తీసుకోవాలని ఏబీవీపీ నాయకులు డిమాండ్ చేశారు. సెంట్రల్ లైబ్రెరీ వద్ద యూనివర్సిటీ సెక్రెటరీ అమృత్‌చారి మాట్లాడుతూ విద్యార్థులు ఇప్పటికే స్కాలర్‌షిప్ రాక, మెస్‌బిల్లులు చెల్లించక సొంత డబ్బులు కట్టాల్సి వస్తుందని అన్నారు. యూనివర్సిటీ అధికారులు తక్షణమే వెంటనే పెంచిన ఫీజులను తగ్గించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు నాగరాజు, సింహాద్రి, సమీర్, అజయ్, సంతోష్, సాయికృష్ణ, దీపక్, హరినాథ్, వినోద్, సంతోష్, సాయి, పురుషోత్తం, తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం

ఖిల్లా, మార్చి29: నగరంలోని జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి నుంచి దేవసరి పోశన్న అదృశ్యమైనట్లు అతని భార్య రాజవ్వ ఫిర్యాదు మేరకుకేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు 1వ టౌన్ ఎస్‌హెచ్‌వో డి.విజయ్‌బాబు తెలిపారు. ఆర్మూర్ మండలం మిర్దాపల్లి గ్రామానికి చెందిన పోశన్న చికిత్స నిమిత్తం ఈనెల 28న ఆసుపత్రిలో చేరాడు. శుక్రవారం ఉదయం 11గంటల ప్రాంతంలో స్కానింగ్ కోసం కిందికి దిగిన పోశన్న కనిపించకపోవడంతో అతని భార్య పోలీసులకు ఫిర్యాదు చేసింది.

ఐపీఎల్ ఫ్యాన్ పార్క్ ఏర్పాటు

పెద్దబజార్, మార్చి 29: క్రికెట్ అభిమానుల కోసం ఐపీఎల్ ఫ్యాన్ పార్క్ ఏర్పాటు చేశామని ఐపీఎల్ నిర్వాహకులు వెంకటరాంరెడ్డి, సత్యపాల్ తెలిపారు. శుక్రవారం నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ నగరంలోని ఉమెన్స్ కళాశాల మైదానంలో ఈనెల 30, 31 తేదీల్లో భారీ స్క్రీన్ ద్వారా క్రికెట్ మ్యాచ్‌ను వీక్షించేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. క్రికెట్ అభిమానులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

జర్నలిస్ట్‌ను ఆదుకోవాలని వినతి

పెద్దబజార్, మార్చి29: డిచ్‌పల్లిలో జర్నలిస్టుగా పని చేసిన వెంకట్ రాంకోటి అనారోగ్య కారణంగా ఇబ్బందులను ఎదుర్కొంటున్నాడని, ఒక కాలు కోల్పోయి ఆర్థికంగా అనేక సమస్యలు పడుతున్న ఆ కుటుంబాన్ని ఆదుకోవాలని టీయూడబ్ల్యూజే ఐజేయు జిల్లా కమిటీ సభ్యులు శుక్రవారం పలువురు నాయకులను కోరారు. మాజీ రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్‌తోపాటు అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ, ఎంపీ అరవింద్‌లను కలిశారు. ఈ సందర్భంగా వారు ఆర్థిక సహాయం అందజేసేందుకు ముందుకు వచ్చారు. ఈ సందర్భంగా వారికి జిల్లా కమిటీ ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఎడ్ల సంజీవ్, జిల్లా ప్రధాన కార్యదర్శి అరవింద్ బాలాజీ, జిల్లా కోశాధికారి సిరిగాదప్రసాద్, జాతీయ కౌన్సిల్ సభ్యులు గంగాదాస్, కార్యవర్గసభ్యుడు బొబ్బిలి నర్సయ్య, ప్రమోద్‌గౌడ్, ప్రెస్‌క్లబ్ కార్యదర్శి బైర శేఖర్, ఉపాధ్యక్షుడు గోవిందరాజు, దేవిదాస్, నర్సయ్య, తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు చేపట్టాలి

● ఫిల్టర్ బెడ్‌లను వెంటనే మరమ్మతులు చేయించాలి: నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా



ఫిల్టర్ బెడ్‌ను పరిశీలిస్తున్న అర్బన్ ఎమ్మెల్యే

ఎడపల్లి/సుభాష్‌నగర్, మార్చి 29: నిజామాబాద్ పట్టణ పజలకు తాగునీటి సమస్య రాకుండా తలెత్తకుండా చర్యలు చేపట్టాలని నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా అధికారులకు సూచించారు. శుక్రవారం ఎడపల్లి మండలంలోని అలీసాగర్ ఫిల్టర్ బెడ్‌లను ఆయన పరిశీలించారు. అనంతరం ఫిల్టర్ బెడ్‌ల నిర్వహణ, అలీసాగర్ చెరువులోగల నీటినిల్వ సామర్థ్యం వివరాలను అక్కడ ఉన్న అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అలీసాగర్‌లో ఉన్న రెండు ఫిల్టర్‌బెడ్‌లలో 50 శాతం రిపేర్లు జరుగుతున్నాయన్నారు. ఫిల్టర్ బెడ్‌లలో ఏర్పాటు చేసిన బాల్‌లు ఎన్నో ఏళ్ల క్రింద ఏర్పాటు చేయడంతో అవిపాతవి కావడంతో తరచూ మరమ్మతులు చేయాల్సి వస్తుందన్నారు. వాటి మరమ్మత్తులు వెంటనే చేయించి వేసవిలో తాగునీటికి ఇబ్బంది కలగకుండా చూడాలని అధికారులకు సూచించారు. నిజామాబాద్ పట్టణానికి ముఖ్యంగా అలీసాగర్ చెరువు నుంచి రెండు ఫిల్టర్ బెడ్‌లతో పాటు మాసాని చెరువు, మంచిప్ప చెరువు ఫిల్టర్ బెడ్‌ల ద్వారా పట్టణానికి మంచినీటి సరఫరా జరుగుతోందని అన్నారు. అలీసాగర్ చెరువు నిజామాబాద్ పట్టణానికి తాగునీటి సరఫరాకు గుండెకాయని అన్నారు. అలీసాగర్ చెరువులో ఇపుడున్న నీటి సామర్థ్యం నిజామాబాద్ పట్టణ వాసులకు 2నెలల వరకు తాగు నీరు అందించడానికి సరిపోతుందని, ఒకవేళ అనివార్య కారణాలతో వర్షాలు ఆలస్యమైతే తాగు నీటి ఇబ్బందులు తలెత్తే ప్రమాదముందన్నారు. అందుకోసం ముందస్తు ప్రణాళిక తయారు చేసుకుని నీటి ఎద్దడి ఏర్పడకుండా నిజాంసాగర్ నీటితో అలీసాగర్ చెరువును నింపి త్రాగు నీటి సమస్య తలెత్తకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఆయన వెంట నిజామాబాద్ కార్పొరేటర్లు, బీజేపీ నాయకులు తదితరులు ఉన్నారు.



సీఎంకు వినతిపత్రం అందజేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్

ఆర్మూర్ అభివృద్ధికి నిధులు కేటాయించాలి

● సీఎం రేవంత్‌రెడ్డికి మున్సిపల్ చైర్‌పర్సన్ వినతి

ఆర్మూర్‌రూరల్, మార్చి29: ఆర్మూర్ పట్టణ అభివృద్ధికి నిధులు కేటాయించాలని కోరుతూ మున్సిపల్ చైర్‌పర్సన్ వన్నెల్‌దేవి లావణ్య, వైస్‌చైర్మన్ షేక్‌మున్న, కౌన్సిలర్‌లు శుక్రవారం సీఎం రేవంత్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. నూతన చైర్‌పర్సన్‌గా ఎన్నికైన లావణ్య శ్రీనివాస్ తమ కౌన్సిలర్‌లతో కలిసి బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి, ఆర్మూర్ నియోజకవర్గ ఇన్‌చార్జీ వినయ్‌రెడ్డి ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా ఆర్మూర్ మున్సిపల్ కార్యాలయ నూతనభవనానికి, అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని కోరగా త్వరలోనే నిధులను కేటాయిస్తామని సీఎం రేవంత్‌రెడ్డి హామీఇచ్చినట్లు తెలిపారు. సీఎంను కలిసిన వారిలో కౌన్సిలర్లు ఇట్టెడి నర్సారెడ్డి, ప్రసాద్, రవిగౌడ్, ఆకుల రాము, ఎస్ఆర్. రమేష్, మాజీచైర్మన్ సంజయ్‌సింగ్‌బబ్లు, కొంతం మురళీ, వనం శేఖర్, రంగన్న, పండిత్ పవన్, రింగుల భూషణ్ ఉన్నారు.

కొత్తపల్లిలో గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు

ఆర్మూర్‌రూరల్, మార్చి29: వేల్పూర్ మండలం కొత్తపల్లి(ఎన్) గ్రామంలో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం పశువులకు ఉచిత గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. 235 పశువులకు టీకాలు వేసినట్టు మండల పశువైద్యాధికారి డాక్టర్ సంతోష్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో పశువైద్యసిబ్బంది, గోపాల మిత్రలున్నారు.

చికెన్ ధరలు



రకం	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	రూ.155	రూ.225	రూ. 265
వెన్‌కాబ్(కిలో)	రూ.165	రూ.235	రూ. 275

బంగారం ధరలు

బిస్కెట్ (10 గ్రా.)	ఆర్నమెంట్(10 గ్రా.)	వెండి(10 గ్రా.)
రూ.69,000	రూ.63,600	రూ.790

సినిమా గైడ్ నిజామాబాద్

పీవీఆర్ మల్టీప్లెక్స్..

స్క్రీన్-1 : టిల్లు స్క్వేర్ (10.10, 1.10, 4.10 7.50, 10.50)
స్క్రీన్-2 : గాడ్జిల్లా అండ్ కాంగ్ (3డీ) (తెలుగు) (12.00, 2.40)
: గాడ్జిల్లా అండ్ కాంగ్ (3డీ) (ఇంగ్లిష్) (5.20, 8.00, 10.40)
స్క్రీన్-3 : ది గోట్ లైఫ్ (12.05, 7.00)
: రజాకార్ (3.45)
: ఓం భీమ్ భుష్ (10.40)
స్క్రీన్-4 : స్ర్కూ (హిందీ) (10.45, 1.35, 7.40, 10.30)
: ప్రేమలు (4.25)

ఉషాప్రసాద్ మల్టీప్లెక్స్..

స్క్రీన్-1 : టిల్లు స్క్వేర్ (10.45, 1.40 4.35, 7.30, 10.25)
స్క్రీన్-2 : గాడ్జిల్లా అండ్ కాంగ్ (10.45, 1.50, 4.25, 10.25)
: ఓం భీమ్ భుష్ (7.30)
స్క్రీన్-3 : ది గోట్ లైఫ్ (1.15, 7.25, 10.40)
: కలియుగ పట్టణంలో (4.30)

దేవి : టిల్లు స్క్వేర్ (11.15, 2.15, 6.15, 9.15)
లలితమహల్ : ఓం భీమ్ భుష్ (11.15, 2.15, 6.15, 9.15)
నటరాజ్ : గాడ్జిల్లా అండ్ కాంగ్ (తెలుగు) (11.15, 2.15, 6.15, 9.15)
విజయ్ : రజాకార్ (11.15, 2.15, 6.15, 9.15)



- నిజామాబాద్ అర్బన్